# ఉద్యమ స్ఫూర్తితో స్వచ్ఛభారత్

- **విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలి**
- **అవార్డులు, ప్రశంసా పత్రాలు ఇస్తాం: ముఖ్యమంత్రి**

ఈనాడు – అమరావతి

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రతపై ప్రజా చైతన్యమే స్వచ్ఛభారత్‌కు సోపానమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం ఉండవల్లిలోని తన నివాసం నుంచి వైద్యారోగ్యం, విద్య, పంచాయతీరాజ్, పురపాలక శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే స్వచ్ఛభారత్ వార్షికోత్సవంలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. “స్వచ్ఛభారత్‌లో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసికట్టుగా పాల్గొనాలి. ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి. ప్రతి గ్రామంలో, పట్టణంలో దోమల ఉత్పత్తి ప్రదేశాలను గుర్తించి లార్వా నియంత్రణ చర్యలు చేపట్టాలి. వార్డులలో క్రమం తప్పక ఫాగింగ్ జరగాలి. తాగు నీటి వనరులన్నీ క్లోరినేట్ చేయాలి” అని ఆదేశించారు. రాష్ట్రంలో పరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలకు అవార్డులు ఇస్తామన్నారు. పార్కులు, బస్టాండ్‌లు, ఆస్పత్రులు, శ్మశానవాటికలు, వార్డులు, గ్రామాల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి అవార్డులు ఇస్తామని, ఉత్తమ శానిటరీ వర్కర్, ఉత్తమ హెల్త్ అసిస్టెంట్ వంటి అవార్డులూ ఉంటాయని తెలిపారు. పరిశుభ్రత కోసం పనిచేసిన వారికి ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు.



## బాలయోగి సేవలు చిరస్మరణీయం

లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఘనంగా నివాళులు అర్పించారు. స్పీకర్‌గా బాలయోగి రాష్ట్రాభివృద్ధికి ఎంతో సహకరించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కోనసీమ అభివృద్ధికి బాలయోగి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. కోనసీమకు రాయల్టీ ఇవ్వాలని ఓఎన్‌జీసీపై గట్టిగా పోరాడిన నాయకుడు బాలయోగి అని కొనియాడారు. అప్పట్లో ప్రధాని వాజపేయి మంత్రివర్గంలో చేరాల్సిందిగా ఆహ్వానించినా నిరాకరించామని, లోక్‌సభ స్పీకర్ పదవి ఇస్తామంటే అందుకు యోగ్యుడైన బాలయోగిని ఎంపిక చేశామని తెలిపారు.